క్లుప్తంగా

ఘనంగా మాస కల్యాణం



నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం స్వామి కల్యాణ మహోత్సాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు అర్చకబృందంచే సత్యభామ, రుక్మిణీదేవి సమేత శ్రీవేణుపాలస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. 11 మంది దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధి చర్యలు

గుళ్ళపూడి(గంపలగూడెం): గంపలగూడెం మండలం గుళ్లపూడిలో అస్తవ్యస్తంగా ఉన్న హిందూ స్మశానవాటిక అభివృద్ధి పనులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు. చిన్నపాటి వర్షానికే నీళ్ల నిలిచిపోయి శవ దహనాలకు కూడా వీలులేకుండా పోయింది. దీనికి తోడు పిచ్చి తుమ్మచెట్ల కూడా కొంత పెరిగాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ పోట్రు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శ్మశానవాటిక ఆవరణను శుభ్రం చేసి, చెరువులో పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్లతో శ్మశానవాటికకు తరలించి చదును చేస్తున్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ముత్తయ్య, ఎంపీటీసీ సభ్యుడు విశ్వనాథం పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

గంపలగూడెం: స్థానిక బస్‌స్టాప్ సెంటర్ వద్ద సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాటసారులకు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. అదేవిధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో గ్రామంలోని పలువురు దివ్యాంగులకు అన్నదానం చేశారు. సమరసత సేవా సమితి అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి సత్యవాణి తగిన సేవలు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులచే పిల్లల బొమ్మల కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు నీతి కథల పుస్తకాలు చదివించారు. వరయ్య ఐసీఆర్‌పీ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ సిబ్బంది టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చూడముచ్చటగా నంద దీపోత్సవం



గంపలగూడెం: స్థానిక షిరిడి సాయిబాబా ధ్యాన నిలయంలో పౌర్ణమి సందర్భంగా నంద దీపోత్సవం ఆదివారం చూడముచ్చటగా నిర్వహించారు. బాబా ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి, నంద దీపాలతో భక్తులు ఆలయ చుట్టూ 11 ప్రదక్షిణలు చేశారు. అనంతరం బాబా మూలవిరాట్‌కు విశేష హారతి ఇచ్చి ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో మూడు పాడిగేదెల మృతి

తిరువూరు: స్థానిక పోతుల చెరువు సమీపంలో ఆదివారం తెగిపడిన విద్యుత్ తీగెలను తాకి పాడిగేదెలు మృతిచెందాయి. పాత తిరువూరుకు చెందిన పెగ్గల్లపాటి సీతారామయ్యకు చెందిన మూడు పాడిగేదెలు మేతకు వెళ్లి చెరువు సమీపంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.లక్షా 50వేలు ఉంటుందని సీతారామయ్య తెలిపారు. తనకు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

ప్లాస్టిక్ అనర్థాలపై కళాజాత ప్రదర్శన

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై కళాజాత ప్రదర్శన ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. గుడివాడ కల్చరల్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం సభ్యులు వీరయ్య, రవితేజ మిషన్ లైఫ్‌లో మన జీవనవిధానం, మొక్కల పెంపకం ప్రాముఖ్యత, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నివారణ అంశాలపై జానపద గేయాలతో వివరించారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక

గంపలగూడెం: గంపలగూడెం మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక ముస్లిం షాదిఖానాలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ అధ్యక్షుడిగా ఆడెపు శ్రీనివాసచారి(గంపలగూడెం), ప్రధాన కార్యదర్శిగా పి.రవీంద్రాచారిని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా బుజ్జి, రామకృష్ణచారి, పెద్ద రాంబాబు, వెంకటాచారి, నరసింహచారి, శేష బ్రహ్మచారి ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు డి.చంద్రశేఖర్, ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి రంగబాబు పాల్గొన్నారు.

జోరుగా సిమెంట్ రోడ్ల నిర్మాణం

- రెండు గ్రామాల్లో 11 రోడ్లు ఏర్పాటు
- సచివాలయం గ్రాంట్‌తో పనులు



గుళ్లపూడిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు

కనుమూరు/గుళ్ళపూడి(గంపలగూడెం): మండలంలోని కనుమూరు, గుళ్లపూడి గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలకు కేటాయించిన రూ.20 లక్షల నిధులతో కనుమూరులో ఐదు రహదార్లు, గుళ్లపూడిలో ఆరు రోడ్లను సిమెంట్‌రోడ్లుగా రూపుదిద్దే పనులను చేపట్టారు. దీంతో అస్తవ్యస్తంగా ఉన్న ఆయా రహదార్లలో ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ప్రధానంగా ఎస్సీ, బీసీ కాలనీల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారు. తదుపరి మిగిలిన ప్రాంతాల్లో రహదార్లల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపడుతున్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణంతో ఆయా రహదార్లు సరైన రూపురేఖలు సంతరించుకుని ప్రజలు రాకపోకలకు సౌకర్యవంతంగా మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కనుమూరులో 467 మీటర్ల సిమెంట్ రోడ్లు

కనుమూరులో కొమ్ము రాజ ఇంటి వద్ద నుంచి కొమ్ము పుల్లయ్య నివేశన స్థలం వరకు 92 మీటర్లు, ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి పుచ్చకాయల లక్ష్మి ఇంటి వరకు 103 మీటర్లు, జుంజు శ్రీను ఇంటి నుంచి చీపు రామకృష్ణ ఇంటి వరకు 99 మీటర్లు, వాటర్ ట్యాంక్ నుంచి యార్లగడ్డ రామస్వామి ఇంటి వరకు 125 మీటర్ల, మంద సీతారామయ్య ఇంటి నుంచి మంద శ్రీనివాసరావు ఇంటి వరకు 48 మీటర్ల సిమెంట్ రహదారి నిర్మాణం పూర్తి చేశారు. పీఆర్ ఏఈ పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు ఏలూరు గాయత్రి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు చెరుకు నర్సారెడ్డి రహదారుల నిర్మాణ పనులను పూర్తి చేశారు. పనులను సర్పంచ్ మందా మారేశ్వరమ్మ, ఉపసర్పంచ్ అట్లూరి వెంకటకృష్ణారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పగడాల రాజేశ్వరి ప్రారంభించారు



గుళ్లపూడిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పోట్రు వెంకటలక్ష్మి



కనుమూరులో పూర్తయిన సిమెంట్ రోడ్డు

గుళ్లపూడిలో 389 మీటర్లు..

గుళ్లపూడిలో అద్దంకి జమలయ్య ఇంటి నుంచి కొంగల జమలమ్మ ఇంటి వరకు 51 మీటర్లు, ఇనపనూరి యేసు ఇంటి నుంచి అద్దంకి తిరుపతిరావు ఇంటి వరకు 61 మీటర్లు సిమెంట్ రోడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తి చేశారు. తేళ్లపుట్ట వెంకటి ఇంటి నుంచి తలారి వెంకటేష్ ఇంటి వరకు 70 మీటర్ల రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. తేళ్లపుట్ట పిచ్చియ్య ఇంటి నుంచి మల్లాది దేవదాస్ ఇంటి వరకు 43మీటర్లు, అద్దంకి రాజేష్ ఇంటి నుంచి అద్దంకి సత్యం ఇంటి వరకు 82 మీటర్లు, బండి చెన్నారావు ఇంటి నుంచి బండి వెంకటేశ్వర్లు ఇంటి వరకు 82 మీటర్ల దూరం సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభించాల్సి ఉంది. మరో వారం రోజుల్లో అన్ని రహదార్ల నిర్మాణం పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ పోట్రు వెంకటలక్ష్మి తెలిపారు. పీఆర్ ఏఈ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు గోపాలరావు ఆధ్వర్యంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు ముత్తయ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మైలవరంలో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివిస్తున్న మహిళాపోలీస్ లలిత



పెనుగొలను గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న బాలబాలికలు



గొల్లపల్లి గ్రంథాలయంలో క్విజ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తిరువూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

మైలవరం: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైలవరం గ్రామం మహిళా పోలీస్ కే లలిత విద్యార్థులకు సూచించారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో మహా భారతం కథలు పుస్తకాలు చదివించారు. అనంతరం మహిళా పోలీస్ లలిత బాల నేరాలు, దిశా చట్టం, బాల బాలికలు సమాజంలో అను దినం జరిగే కార్యక్రమాల్లో తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. గ్రంథాలయ సిబ్బంది సయ్యద్ అహ్మద్, రాజేంద్రప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పెనుగొలను(గంపలగూడెం): వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత పీడత బాలల దినోత్సవం సందర్భంగా బాలబాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన క్యారమ్స్, లూడో, చదరంగం, కబడ్డీ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వీ శేషిరెడ్డి, షిర్డీసాయిబాబా సేవా కమిటీ సభ్యులు నారాయణరావు, ఉపాధ్యాయులు నాగరాజు, గ్రంథాలయ నిర్వహణాధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు సెల్‌ఫోన్ వలన కలిగే నష్టాలను రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈమని శేషయ్య అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌ను అవసరమైన వరకే ఉపయోగించాలని, అనవసరమైన వాటిని చూస్తూ ఎక్కువ సమయం గడపడం వల్ల కళ్లకు హాని కలగడంతో పాటు విలువైన సమయం వృథా అవుతుందన్నారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది యశ్వంత్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లి శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా హైస్కూల్ హిందీ ఉపాధ్యాయిని దాసరి దుర్గామల్లేశ్వరి విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


తిరువూరులో..

తిరువూరు: స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఆదివారం కొనసాగింది. విద్యార్థులకు తెలుగు పద్యాలు, వ్యాకరణంలో తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, చదరంగంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు.

మహనీయుల జీవిత చరిత్రలు చదవాలి

ముసునూరు: గ్రంథాలయాల్లో లభ్యమయ్యే మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను చదవాలని పలువురు ఉపాధ్యాయులు సూచించారు. గోపవరం గ్రంథాలయంలో శాఖ అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో 28వ రోజు ఆదివారం చరిత్ర ప్రాధాన్యాన్ని చిన్నారులకు వివరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల 1992–93 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. రుక్మిణీకృష్ణ ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో నిర్వహించిన సమావేశంలో పలు ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులుగా, సచివాలయ ఉద్యోగులుగా, పలు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో తమ అనుభవాలను పునరావలోకనం చేసుకున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

చాట్రాయి: ఆస్తి వివాదం నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. పర్వతాపురంలోని కల్లేపల్లి వెంకటేశ్వరావుకు చెందిన సర్వే నంబర్ 94లో 10 సెంట్ల భూమి ఉంది. దీనిని అదే గ్రామానికి చెందిన కల్లేపల్లి కృష్ణ, రాజారావు సుమారు 45 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారు. ఇటీవల ఈ భూమిని సర్వే చేయడంతో 10 సెంట్లు వెంకటేశ్వరావు భూమిలో ఉందని తేలడంతో ఆ భూమిని తమకు ఇవ్వాలంటూ తహసీల్దార్‌కు అర్జీ పెట్టారు. కొంత కాలం తర్వాత స్పందనలో అర్జీ పెట్టుకున్నారు. స్పందన అర్జీపై నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ క్షేత్ర స్థాయిలో ఇటీవల భూమిని పరిశీలించి కోర్టు ద్వారా లేదా గ్రామ పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు సూచించారు. గ్రామంలో పంచాయతీ పెట్టగా ఏడు సెంట్లు వెంకటేశ్వరావుకు, చాల కాలం నుంచి సాగు చేసుకుంటున్నందుకు మూడు సెంట్లు కృష్ణ, రాజారావుకు ఇవ్వాలంటూ పెద్దలు సూచించారు. దీనికి వెంకటేశ్వరరావు అంగీకరించకుండా 10 సెంట్ల భూమి తనదేనంటూ భూమి చుట్టూ కంచెను ఏర్పాటు చేయడంతో ఇరువర్గాలు గొడవ పడి కొట్టుకున్నారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమల్లో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను స్పందనలో అందజేస్తే వాటిని గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

చిలుకూరివారిగూడెం(మైలవరం): మండలం చిలుకూరివారిగూడెం శ్రీఅప్పిడి సుబ్బారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌న(ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్)కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వి. నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎంపిక పరీక్షల్లో అధిక శాతం మార్కులు సాధించినందుకు గాను బేతు పావని, ఒగ్గు షారోన్, ఉల్లిబోయిన కృష్ణమనోహర్, వెలివెల జ్యోతి ప్రసన్న, బండారు రాహిత్య, కొంకా హారిక ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు పాటు ఏడాదికి రూ.12వేలు స్కాలర్‌షిప్‌ను అందజేయనున్నట్లు తెలిపారు.

ఖిల్లాను సందర్శించిన కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కర్నూలు నగర ఎమ్మెల్యే మహ్మద్ అబ్దుల్ హఫీజ్ ఖాన్ శనివారం రాత్రి కొండపల్లి ఖిల్లా కోటను ఆకస్మికంగా సందర్శించారు. కోటలో పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ గ్యాలరీని పరిశీలించారు. కొండపల్లి కోట, రాజరిక చరిత్రను అడిగి తెలుసుకున్నారు. కొండపల్లి పోర్ట్ యాప్ ద్వారా ఆనాటి రాజుల చరిత్ర, వారి చేసిన వ్యాపార అభివృద్ధి పనులు, పరిపాలన అంశాలను ఆసక్తిగా పరిశీలించారు. కొండపల్లి కోటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన లేజర్ షో తిలకించారు. ఆయన మాట్లాడుతూ కొండపల్లి కోట, మ్యూజియం, లేజర్ షో తనను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. ఇదే మాదిరిగా కర్నూలు కొండారెడ్డి బురుజు కోటలో లేజర్ షో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

ఏ.కొండూరు: కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బబ్బూరి శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఆరో తేదీన కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ డయాలసిస్ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు, చైతన్య నగర్ తండాలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారిని పరామర్శించేందుకు విచ్చేస్తున్నట్లు తెలిపారు.

7న హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేలలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానానికి చెందిన హుండీ కానుకలను ఈ నెల 7వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ వై సీతారామయ్య ఆదివారం తెలిపారు. దేవదాయశాఖాధికారి పర్యవేక్షణలో, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీస్, రెవెన్యూ అధికారులు, భక్త సమాజం సభ్యుల సమక్షంలో అమ్మవారి ఆలయ ఆవరణలో హుండీ కానుకలు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. విస్సన్నపేటలో ఉన్న చంద్రశేఖరస్వామి దేవస్థానానికి చెందిన హుండీ కానుకలను 7వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి దేవదాయ శాఖాధికారి పర్యవేక్షణలో లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

మల్లయోధుల పోరాటానికి సీపీఐ సంఘీభావం

ఇబ్రహీంపట్నం: ఆత్మగౌరవం కోసం భారత మహిళా మల్లయోధులు చేస్తున్న పోరాటానికి సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం సంఘీభావ యాత్ర జరిగింది. ఇబ్రహీంపట్నం, జికొండూరు మండలాల్లో జరిగిన యాత్రలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ రెజ్లింగ్ మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరన్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గం కార్యదర్శి బుద్ది రమేష్ పాల్గొన్నారు.

పథకాలు అమలు తెలుసుకునేందుకే గడప గడపకు మనప్రభుత్వం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



ఎమ్మెల్యే రక్షణనిధికి కేక్ తినిపిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

ఎమ్మెల్యే రక్షణనిధి

కలగర (విస్సన్నపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నదీ లేనిదీ తెలుసుకునేందుకే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం అని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని కలగర సచివాలయం పరిధిలో రామచంద్రాపురం గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలు గురించి వివరించడంతో పాటు, ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్‌ను అందజేశారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా అర్హులందరికీ నేరుగా వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

175వ రోజు వేడుకలు

ఎమ్మెల్యే రక్షణనిధి గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి 175 రోజులు పూర్తయిన సందర్భంగా కలగర రామచంద్రాపురంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు, ప్రజల సమస్యలు తెలుసుకోవడం చాలా మంచి కార్యక్రమం అని ఎమ్మెల్యే రక్షణనిధి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రజల అభిమానం పొందారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 175కు 175 స్థానాలు వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీలో ప్రతిఒక్కరూ కృషి చేయాల న్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ మెర్సీ వనజాక్షి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు లోకేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, సర్పంచ్ దేశిరెడ్డి రమ, డైరెక్టర్ భూక్యా రాణి పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి పూజ



ముసునూరులో ఏరువాక సాగు పనులు ప్రారంభించిన నాయకులు

ముసునూరు: వానలు మెండుగా కురవాలి, పంటలు బాగా పండాలంటూ రైతులు, రైతు కూలీలు, శ్రామికులు ఏరువాక పూజలు నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయాధికారి చేబత్తిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఏరువాక సాగు కార్యక్రమాలను ఆరంభించారు. ముసునూరులో వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు రేగుల గోపాలకృష్ణ, పల్లిపాము కుటుంబరావు, మాజీ వార్డు సభ్యుడు గండిపూడి రామారావు రైతులతో కలసి కాడి–జోడెడ్లకు పసుపు కుంకుమలు దిద్ది పూజలు చేసి, అరకతో దుక్కి దున్నారు. ఏరువాక పూజ ముగించిన అరగంటలోనే ఒక మోస్తరు వర్షం కురవడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి పాల్గొన్నారు.

వర్షం రాకతో రైతుల్లో హర్షాతిరేకాలు

ముసునూరు: ఏరువాక పౌర్ణమి సాక్షిగా ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వరి నారుమళ్ల సిద్ధం చేసుకున్న రైతులు వర్షం రాకతో తమ ఆకుమడులకు నీరు లభించిందని ఆనందిస్తున్నారు. నీటి కోసం ఇబ్బంది పడకుండా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కొనసాగుతుందనే, ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. జగనన్న మాట ఇచ్చిన ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం ముందే అందడం, మరో వైపు వర్షానికి ముందుగానే వ్యవసాయ శాఖాధికారి చేబత్తిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ చేయడంతో రైతులు ఆకుమడులు తయారు చేసుకుని వరి విత్తనాలు చల్లుకునే పనులలో నిమగ్నమయ్యారు. చెక్కపల్లి, లోపూడి, గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం గ్రామాలలో వరిమడులలో పచ్చిరొట్ట పంటలను పెంచే పనులను ముమ్మరంగా చేపట్టి నారుమడులలో విత్తనాలను చల్లుతున్నారు. మండలంలో ప్రతి ఏటా 2,500 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పండిస్తూ ఉండగా, ఈ ఏడాది వర్షాలు ముందుగానే ఆరంభం కావడంతో 3,000 హెక్టార్లలో వరి పంట సాగు చేయడం జరుగుతుందని వ్యవసాయాధికారి పేర్కొన్నారు.